# ఎవరు బాధ్యులు

ఇది కథ కాదు. కల్పన అంత కంటే కాదు. జీవితం. ఒకొక్క సారి జీవితం కథ కంటే కల్పన కంటే కూడా చాలా చిత్రంగా ఉంటుంది. అసలు ఈ సృష్టి క్రమమే చాలా చిత్రమయిందేమో! ఎక్కడో జన్మించిన మానవుడు ఎక్కడెక్కడో తిరుగుతాడు. అతని జీవిత మార్గంలో ఎందరెందరో ఎదురు పడతారు. కొందరు తొలగి వెళ్ళి పోతారు. కొందరు ఓ క్షణ కాలంపాటు ఆగి ముందుకు సాగి పోతారు. చాలా తక్కువ మంది ఎక్కువ సేపు ఆగి అతని హృదయ కవాటం నుంచి లోపలకు ఒక్కసారి తొంగి చూసి వెళ్ళిపోతారు. ఇందులోని ఏ ఒక్కరి ప్రవేశంవల్ల అతని జీవితంలో గాలిదుమారం లేవదు. హృదయంలో అగ్ని పర్వతాలు బద్దలు కావు. కళ్ళ నుంచి లావా ప్రవహించదు. కాని ఊహించనివిధంగా ఏదో ఒక నాడు, ఎక్కడో ఒక చోట, ఓ వ్యక్తి అతని జీవితంలో తుఫానును వెంట బెట్టుకొని ప్రవేశించి తీరుతుంది. ఒకర్ని చూసి ఒకరు ఉలిక్కి పడతారు. ఒకర్నొకరు మరోసారి వెనక్కు తిరిగి చూసుకుంటారు. మళ్ళీ మళ్ళీ చూస్తారు. ఒకర్నొకరు గుర్తించుకున్నట్లు చిరునవ్వు నవ్వుకుంటారు.

అప్పుడు వారికి సృష్టిలోని ప్రతి వస్తువులోనూ ఇంద్రధనస్సు రంగులే కనుపిస్తాయి. సంఘం, సభ్యత, సంస్కృతి, మర్యాదలు, అంతస్థులు— ఇవేవీ వారి మధ్య అడ్డు నిలవ లేవు.

ఇలా ఎందుకు జరుగుతుందో? ఉన్నతోన్నతమైన విజ్ఞాన శిఖరాల మీద నిల్చొని ఈ నాటి మానవుడు సృష్టి రహస్యాన్నే తెలుసుకోవటానికి ప్రయత్నిస్తున్నాడు. ఒకనాడు దేవతలని భ్రమించి పూజించిన సూర్య చంద్రుల అంతు తెలుసుకొంటున్నాడు. చంద్రమండలానికి ప్రయాణం సాగిస్తున్నాడు. ఆగిపోయిన గుండెను మళ్ళీ ఆడించే శక్తిని కూడా పొందుతున్నాడు. కాని ఆ గుండెల్లో దాగి వున్న మమతల, మమకారాల మీద ముడతల్ని విప్పగలుగుతాడా ఏనాటికైనా! ఒక వ్యక్తి ప్రవేశం మరో వ్యక్తి జీవితంలో గాలిదుమారాన్ని ఎందుకు లేవదీస్తుందో తెలుసుకో గలడా? ఒక వ్యక్తి పాదాల చప్పుడు మరో వ్యక్తి హృదయ తంత్రులను ఎందుకు మీటుతుందో ఏనాటికైనా మానవుడు తెలుసుకో గలడా?

తాండవ నది నిండుగా ప్రవహిస్తోంది. అంతకు ముందే వర్షం కురవటం ఆగి పోయిందేమో వాతావరణంలో చల్లదనం, ప్రశాంతత మిళితమైంది. రకరకాల క్రిమి కీటకాలు చిత్రవిచిత్ర ధ్వనులు చేస్తున్నాయి. ఆకాశంలో మేఘాలు కమ్ముతూనే వున్నాయి. ఊరికి కొంచెం దూరంగా నదికి వంద గజాలలో వున్న విట్టాడి గుడిసెలోని దీపపు గుడ్డి వెలుగు ఆ ఇంటిచుట్టూ గోడలకు బదులుగావున్న తడికెల రంధ్రాలనుంచి బయటకు రావటానికి ప్రయత్నిస్తోంది.

ఆ గుడిసె వాకిలి (తడిక) కొద్దిగా తెరచుకొంది. ఒక్కసారిగా చల్లగాలి రివ్వున లోపలకు దూసుకువచ్చింది. కోడిగుడ్డు లాంతరు దీపం రెపరెపలాడింది. వెంటనే తడిక మూసి ఆమె యాంత్రికంగా నులకమంచం పట్టెమీద కూర్చుంటూ అతని ముఖంలోకి చూసింది.

ఇంకా తెల్లవారటానికి చాలా సమయం వుంది.

"భగవంతుడా! ఎలాగయినా ఈ రాత్రి గట్టెక్కించు" అంటూ చేతులతో మొక్కింది, మనసులోని భగవంతునికి.

కుక్కి మంచంలోని ఆ పొడుగాటి అస్థిపంజరంలా వున్న ఆకారాన్ని చూస్తే అది ఒకప్పుడు ఆకర్షణీయమైన భారీ విగ్రహమే ననిపిస్తుంది.

ఆ అస్థిపంజరం కళ్ళు చిన్నగా విప్పుకుంటున్నాయి. నిర్జీవమైన ఆమె గాజు కళ్ళలో లీలగా కాంతిరేఖ కదిలింది. అతని పైనుంచి కుడిచేతిని మంచం పట్టెమీద వేసి అతని ముఖంమీదకు వంగి, కళ్ళల్లోకి చూసింది.

ఎంతో కాలంగా ఆముదపు దీపపు వత్తిలా కొడి కట్టుకొని పోయిన అతని కళ్ళజ్యోతి ఒక్కసారిగా వెలిగింది. ఆమె ముఖంలోకి చూశాడు పరీక్షగా. నీళ్ళుకూడా ఏనాడో ఇంకి పోయిన ఆ కళ్ళు కొంచెంగా చెమ్మగిల్లటము ఆమెకు కనిపించింది, అతడు ఏదో మాట్లాటానికి ప్రయత్నించాడు. కాని మాట్లాడ లేక పోతున్నాడు. ఏ నాడో పడి పోయిన నాలుక నిర్దయగా అతని కోరికను నిరాకరించింది. చేత్తో

సైగ చెయ్యాలని ప్రయత్నించాడు. ఆరు నెలల క్రితంపడి పోయిన అతని చేతులు కదలలేదు. ఇక తనకు మిగిలింది మరోక్షణంలో శాశ్వతంగా మూతలు పడిపోబోతున్న ఆ కళ్లు మాత్రమే; ఆ కళ్ళతోనే ఆమెకు ఏదో చెప్పాడు. గత ఆరు మాసాలగా అతను ఆమెతో మాట్లాడు తున్నది ఆ కళ్ళతోనే. మాటలురాని పసి బిడ్డకు ఎప్పుడు ఏం కావాలో, ఎందుకు ఏడుస్తుందో తల్లి కొక్కదానికే అర్థం అవుతుంది. అలాగే అతనికి ఏం కావాలో, ఏం చెప్ప దలచుకున్నాడో, ఆమె అతని కళ్ళలోనే చదవటం నేర్చుకున్నది. "బాధ పడకండి మీరు నాకు చేసిన అన్యాయం ఏమీలేదు. జీవితంలో ఇంకా ఏమేమి చూపించ దలచుకున్నాడో భగవంతుడు నాకు" అన్నది ఆమె అతని చెమ్మగిలిన కళ్ళను పమిట చెంగుతో ఒత్తుతూ.

"దివా! నా దివా!" గట్టిగా అరిచానను కున్నాడు. కాని అవి శబ్దరూపంలో బయటకు రాలేదు. చివరిసారిగా ఆమె తలను నిమరాలను కున్నాడు. గుండెలకు గట్టిగా హత్తుకోవాలను కున్నాడు. కాని శరీరంలోని ఏ భాగంకూడా అతని స్వాధీనంలో లేదు.

ఆమె అతని కోరికను అర్థం చేసుకుంది. అతని గుండెల మీదకు వరిగి పోయింది.

మూడు రోజులగా నిద్రాహారాలు లేక అలసిపోయిన ఆమె శరీరానికి మనస్సుకూ ఏదో శాంతి లభించి నట్లనిపించింది. తిరణాల్లో తప్పి పోయి ఏడ్చి ఏడ్చి అలసి పోయివున్న పిల్లవాడు, మళ్ళీ తల్లి కనిపించి ఆమె ఒడిలోకి తీసుకోగానే

నిశ్చింతగా నిద్ర పోయినట్లు ఆమె అతని ఎముకల గూడు లాంటి గుండెలమీద వాలగానే నిద్ర పోయింది.

చావు బ్రతుకుల మధ్య పోరాడుతున్న అతను గతంలోకి జారి పోయాడు: ముప్పయి సంవత్సరాల క్రితం తను ఆమెను ఈ ఊరు తీసికొని వచ్చిన రోజు ఇలాగే ఆమె తన గుండెల్లో తలదాచుకొని ఏడ్చి ఏడ్చి నిద్ర పోయింది.

ముప్పయి సంవత్సరాల నాడు పాతి కేళ్ళు నిండని కొండయ్య బ్రతుకు తెరువును వెతుక్కుంటూ బయలుదేరాడు.

తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాలకు హద్దులను ఏర్పరుస్తూ తాండవనది ప్రవహిస్తుంది. వంతెనకు ఈవలి వైపు తుని, ఆవలి వైపు పాయకరావు పేట. చూట్టానికి తమాషాగా ఉంటుంది. వంద గజాల దూరంలో రెండు వేరు వేరు జిల్లాలకు సంబంధించిన వేరు వేరు గ్రామాలు.

పాయకరావు పేట నేత పనికి ప్రసిద్ధికెక్కిన చిన్న పల్లెటూరు. అక్కడ ఎక్కువ మందికి జీవనోపాధి నేత పనిగానే ఉంటుంది.

కొండయ్య పాయకరావు పేట దేవాంగుల వంశంలో జన్మించినాడు. అతడు జన్మించి నప్పుడు ఏ గొప్ప సంఘటనా జరగలేదు. కనీసం ఆకాశంనుంచి ఓ చిన్న చుక్కయినా రాలలేదు.

కొండయ్య పదేళ్ళు నిండీ నిండకుండానే తల్లి దండ్రులకు దూరం అయ్యాడు. మేన మామ దగ్గిర పెరిగాడు.

అతను నేత పనిలో మంచి ప్రావీణ్యతను సంపాదించాడు. కొండయ్య నేసిన చీరలకు ప్రత్యేకమైన గిరాకీ ఉండేది.

ఆరడుగుల ఎత్తు. భారీ విగ్రహం. చామనిచాయ. కోరమీసం, అందమైన వాడనీ, బుద్ధి మంతుడనీ అందరూ చెప్పుకునేవారు. రంగయ్య ఆ వూళ్ళోకల్లా మోతుబరి వ్యాపారి. అతనికింద ఇరవై పైగా మగ్గాలు పని చేసేవి. కొండయ్య పనితనం గురించి విన్న రంగయ్య అతన్ని పిలిపించి తన దగ్గర ఉద్యోగం ఇచ్చాడు, నెలకు ముప్ఫయ్ రూపాయిల జీతం.

దారిద్ర్యంతో, గంపెడు పిల్లలతో బాధ పడుతున్న కొండయ్య మామకు కొండంత సంతోషం కలిగింది. కొండయ్య మామ కూడా ఎంతో కాలంగా రంగయ్య దగ్గరే పని చేస్తున్నాడు. కాని అతని జీతం పెరిగి పెరిగి ఇరవైలో ఆగిపోయింది. ఒక వైపు దారిద్ర్యంతో బాధపడుతూ కూడా కొండయ్యను కొండయ్య మామా, అత్త కూడా పెంచి పెద్ద వాణ్ణి చేశారు. కొండయ్యకు అత్తా మామలంటే ఎంతో అభిమానం.

రంగయ్య ఆస్తికంతా వారసురాలు ఒకే కూతురు. ఆ కూతుర్ని యోగ్యుణ్ణి చూసి ఇచ్చి ఇల్లరికం తెచ్చుకోవాలని రంగయ్య కోరిక. కొండయ్యను చూసిన రంగయ్యకు ఇంత కంటే యోగ్యుడు ఇంకెవరు దొరుకుతారు అనుకున్నాడు.

ఒక నాడు రంగయ్య, కొండయ్య మామను పిలిచి తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. కొండయ్య అదృష్టానికి అతని మామ ఉబ్బి తబ్బిబ్బయాడు. ఆ విషయం విన్న

కథా నిలయం
4901
శ్రీకాకుళం

డయ్య గుండెలు లయ తప్పలేదు. అతడు ఎలాటి ఉద్రేకాలకు గురి కాలేదు.

ఆ రాత్రి కొండయ్యకు అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. అత్తా మామా ఏదో విషయం మీద ఘర్షణ పడడం విన్నాడు.

"తల్లీ తండ్రీ లేనివాడు. వాడికి అంత అదృష్టం పట్టబోతుంటే సంతోషించక ఏడుస్తా వేంటే?"

"వాణ్ణి ఇంతవాణ్ణి చేసింది ఎవరు? ఇంట్లో ఎదిగి కూర్చున్న ఆడపిల్లను పెట్టుకొని వాడికి ఎవర్నో ఇచ్చి పెళ్ళి చేస్తానంటావు. నీకేమైనా మతిపోయిందా ఏంటి?"

"చక్కని చుక్కతోపాటు బోలెడంత ఆస్తివస్తుందంటే వద్దని వాడికి ఈ అనాకారిని గుదిబండలా తగిలించమంటావా?"

"నీ కూతుర్ని నువ్వే అంత చులకనగా మాట్లాడితే పరాయి వాళ్లెవరు చేసుకుంటారు? వాడు ఈ ఇంటికి వచ్చిన రోజే నాకు అల్లుడు వచ్చాడని మురిసిపోయాను." దుఃఖంలో ఆమెగొంతు పెగలలేదు.

"అందుకని..."

"అందుకని నేనే మంగూను చేసుకుంటాను మామయ్యా!" మామ మాటలకు మధ్యలోనే అడ్డుపడుతూ అన్నాడు, అప్పుడే అక్కడికు వచ్చిన కొండయ్య.

అత్తా మామయ్యా ఇద్దరూ ఉలిక్కిపడ్డారు. అత్త ముఖం ఆనందంతో వెలిగిపోయింది. మామ కళ్లల్లో నీరు తిరిగింది. అతను కొండయ్యను కౌగలించుకున్నాడు.

* * *

కొండయ్య పెళ్ళి మంగమ్మతో జరిగిపోయింది. ఊళ్ళో అంతా కొండయ్యను పిచ్చివాడన్నారు. లక్ష్మీదేవిని కాల దన్నిన దరిద్రుడన్నారు కొందరు.

పెళ్ళయిన మరుసటి నెలలోనే కొండయ్యకూ అతని మామకూ కూడా ఉద్యోగాలు ఊడాయి.

మళ్ళీ ఇంట్లో దరిద్రదేవత ప్రవేశించింది. ఆమె ఎక్కడుంటే అక్కడే శాంతి లోపిస్తుందని వేరే చెప్పనక్కరలేదు. మానవునికి కనీస అవసరాలు అవీ తీరుతున్నంతవరకే ఈ మనసులూ మమకారాలూ పని చేస్తాయి. మంగూకు అనాకారి తనంతోపాటు నోటి దురుసుతనం కూడా. కొండయ్యకు భార్యఅంటే రక్తి ఏనాడూ లేకపోగా విరక్తి పెరగ సాగింది.

కొండయ్య పెళ్లిఅయి సంవత్సరం తిరక్కుండానే ఆ ఇంట్లో ఇంకోప్రాణి నాకూ నోరుందిఅంటూ ఏడుస్తూ ప్రవేశించింది. కొండయ్యకు కొడుకుపుట్టిన సంతోషం ఏమీ కలగలేదు. కొండయ్యకే కాదు ఆ ఇంట్లో ఎవరికీ ఎలాటి సంతోషం కలుగలేదు. మంగూ అయితే వాడు ఏడ్చినప్పుడల్లా సూపీ మోపీ మాటలనేది.

కొండయ్య ఆ ఇంట్లో అందరి దృష్టిలో అప్రయోజకు డయాడు. అంత అభిమానించే మామకుకూడా విసుగు ప్రారంభం అయింది. ఏం చేస్తాడు! ఆకలిగొన్న మానవుడు ఎండుపుల్లలా మాడక !

ఒకరోజు భార్యతో ఘర్షణపడి బయటకు వెళ్ళిపోయిన కొండయ్య తిరిగిరాలేదు.

ఉత్తర దేశంలో ఇంకా నేతపనికి ముఖ్యంగా జరీపనికి చాలా మరింపు ఉన్నదని విన్న కొండయ్య అష్టకష్టాలు పడి లఖ్నోపట్నం చేరుకున్నాడు. కొండయ్యపని తనం పరీక్షించి లఖ్నోకెల్లా పెద్ద వ్యాపారసుడయిన మదన్‌లాల్ కంపెనీలో చేరాడు. జరీ పనితనంలో పేరుమోసిన మదన్‌లాల్ కంపెనీకి దూరదూర ప్రాంతాలనుంచి ఆర్డర్లు వచ్చేవి. కొండయ్య నేసిన జరీచీరలు ఆ ప్రాంతాల్లో కొత్త నమూనాలుగా అందర్నీ ఆకర్షించాయి. నెలకు వందరూపాయిల జీతంమీద ఉద్యోగంలో చేరాడు. నెలనెలా ఇంటికి మామపేర ఏభయ్ రూపాయిలు పంపేవాడు.

కొండయ్యకు ఆ ప్రాంతపు భాషరాక కొంతకాలం బాధపడ్డాడు. కాని త్వరలో మాట్లాడటం నేర్చుకున్నాడు. హోటల్లోతిని ఆ కంపెనీలోనే ఒక గదిలో ఉండేవాడు. అక్కడ అతన్ని అన్నిటికంటే ఆకర్షించిందీ ఆశ్చర్యపరచిందీ అక్కడి స్త్రీల ఘోషాపద్ధతి. బజార్లో ఎక్కడా ఆడవాళ్ళు కనిపించేవారు కాదు. అంత కనిపించినా పైనుంచి కిందకు బురఖాలోఉన్న ముస్లింస్త్రీలో, గుండెలవరకూ ముసుగు వేసుకొని హిందూ స్త్రీలో కనిపించేవారు.

భారత స్త్రీ అసలైన బానిసరూపం చూడాలంటే ఉత్తరదేశంలోనే చూడాలనుకొనేవాడు కొండయ్య. అతన్ని అక్కడ అందరూ మద్రాసీ అనీ పరదేశీ అనీ అనేవారు.

ఉత్తరాదిన దక్షిణాదినుంచి ఎవరు వెళ్ళినా మద్రాసీ అనే అంటారు.

మదన్‌లాల్ ఆగర్భ శ్రీమంతుడు. అతని తండ్రీ తాత వడ్డీవ్యాపారం చేసేవారు. అతడు వడ్డీ వ్యాపారంతో పాటు బట్టలకు జరీపని తనం చేయించే వ్యాపారంకూడా మొదలుపెట్టాడు. అందులో మంచిడబ్బు సంపాదించాడు. అతనికి నలుగురు కొడుకులు. కడసారిది ఆడపిల్ల. ఆడపిల్లకు ఐదు సంవత్సరాలు నిండకుండానే తల్లి చనిపోయింది. పిల్లల కోసం అతను మళ్ళీ పెళ్ళిచేసుకోలేదు. ఆ పిల్లంటే తండ్రికీ, అన్నలకూకూడా అపురూపం.

ఆ తండ్రి కూతురుకు పేరు పెట్టటానికి ఎందరి పండితుల్నో పరామర్శించాడు. చివరకు 'దివా' అని నామకరణం చేశాడు. తనకూతురు జీవితాంతం పగటి వెలుగుతోనే గడిచిపోవాలని ఆ తండ్రిఆశ. ఆ ఇంట్లో ఆ పిల్లమాటకు ఎదురాడే ధైర్యం ఎవరికీ లేదు. పదహారు సంవత్సరాల వయస్సు వచ్చినా కష్టం అని దేన్నిఅంటారో ఆమెకు తెలియదు.

ఆ రోజు దివాచీమీద కూర్చొని కాశీ మజిలీకథలు చదువుకుంటోంది. ఆమె పెద్దవదినా, మూడోవదిన వచ్చి పక్కన కూర్చున్నారు. దివా పుస్తకంలోనుంచి కళ్ళు ఎత్తి వదినలవైపు ప్రశ్నార్థకంగా చూసింది.

"విన్నావా దివా! మన కంపెనీలో ఒక పరదేశి పని చేస్తున్నాడట. చంచల చెప్పేంతవరకూ మనకు తెలియదు. అతను చీరలకు బలేగా జరీపువ్వులు కుడతాడట" అన్నది పెద్దవదిన.

"పరదేశియా? నిజంగానా?' అంది దివా తన పెద్దపెద్ద కళ్ళను ఆశ్చర్యంతో ఇంకొంచెం పెద్దవిచేస్తూ.

‘నిజం దినా! మరి నీకు అతన్ని చూడాలని లేదా ?’’ అడిగింది మూడోవదిన.

“ఉంది! నాకు పరదేశీలంటే బలేఇష్టం. సినిమాలో తప్ప ఎప్పుడూ చూళ్ళేదు.” అంది దినా కుతూహలంతో.

“పరదేశీని మనింటికి తీసుకురమ్మని నాన్నగారితో చెప్పు.”

“నాన్నగారితోనా! అమ్మో !”

“ఏం? మనః మాత్రం జరీపువ్వులు కుట్టించుకోవద్దా?” అంటూ గబుక్కున తలమీదనున్న ముసుగును ముఖం మీదకు లాక్కొని లేచింది పెద్దవదిన. ఆమెతోపాటు చిన్నవదినా అలాగే చేసింది. ఇద్దరూ త్వరత్వరగా లోపలకు వెళ్ళిపోయారు.

మదన్‌లాల్ మధ్యాహ్నం భోజనానికి వచ్చాడు. వస్తూనే కూతురు పక్కన కూర్చొని తల నిమురుతూ ‘ఏం చేస్తున్నావమ్మా’ అన్నాడు ఆప్యాయంగా.

‘నాన్నా? మరే’ ఆగిపోయింది సందేహంగా.

“చెప్పమ్మా ఏం కావాలి?” అన్నాడు మదన్‌లాల్.

“మన కంపెనీలో పనిచేస్తున్న పరదేశిని మనింటికి తీసుకురా నాన్నా.”

మదన్‌నాల్ ఉలిక్కిపడి కూతురువైపు చూశాడు. “వదినెలూ, నేనూ, మాకు కావాల్సిన జరీపువ్వులు చెప్పి నేయించుకుంటాం” అంది దినా గారాం చేస్తున్నట్లు.

మదన్‌లాల్ చిరునవ్వుతో. “అలాగే నమ్మా .. నీకు

త్వరలో పెళ్ళికూడా చెయ్యాలను కుంటున్నాను. కావాల్సిన బట్టలు నేయించుకో” అన్నాడు.

దివా ఆనందంతో ఆవార్తను వదినలకు అందించ టానికి లోపలకు పరుగెత్తింది.

పరదేశి కాబట్టి తన ఇంట్లో వాళ్ళు అతని ఎదటుపడ్డా పర్వాలేదను కున్నాడు మదన్‌లాల్.

* * *

ఆ రాత్రంతా దివాకు నిద్రరాలేదు. పరదేశి రూపాన్ని రకరకాలుగా ఊహించుకో సాగింది. పరదేశి రాజకుమారుల్ని రాజకుమార్తెలు ప్రేమిస్తారు. పరదేశి సినిమాల్లో కూడా అతను కుర్షీద్‌ను ప్రేమిస్తాడు. ఎం చక్కగా ప్రేమించు కోవచ్చునో! ఈ పరదేశీ తప్పక తనను ప్రేమిస్తాడు, అమ్మ బాబోయ్! నాన్నకు తెలిస్తే ఇంకేమయినా వుంటుందా? తెలిస్తే మాత్రం ఏమవుతుందేం? పేమించిన వాళ్ళు భయపడ కూడదుగా? దివాబుర్రలో కాశీమజిలీ కథల్లో రాజకుమారులూ రాజకుమార్తెలూ, లైలామజునూ, హీర్ రాంఝూ, శిరీన్ ఫరహాదులూ గిర్రున తిరగసాగారు.

రోజూ ఏడుగంటలయినా ఎవరైనా వచ్చి లేపితేనే గాని నిద్రలేవంది ఆరోజు ఏడుగంటలకల్లా స్నానంచేసి ముస్తా బయింది.

“ఇంతఅందం, అలంకారం ఆ పరదేశీకోసమే !” అంటూ ఆటలు పట్టించారు వదినెలు. దివా బంగారు బుగ్గలో గులాబీలు విచ్చుకున్నాయి సిగ్గుతో.

ఆ క్షణం రానేవచ్చింది. పెద్దన్నయ్యతో పరదేశీ వచ్చాడు. అంతకుముందే నేతకావల్సిన పరికరాలు తెచ్చి పెద్ద హాల్లో అమర్చిపోయారు పనివాళ్ళు.

"అమ్మా దివా ఇలారా ?" అన్నయ్య పిలుపువిన్న దివా గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

"మా చెల్లె చెప్పినట్లుచేసి దాన్ని మెప్పించావా నీకు నాన్నగారు జీతంకూడా పెంచుతారు. లేదా ఉద్యోగం ఊడటం ఖాయం" అంటూ నవ్వాడు దివా పెద్దన్నయ్య.

దివా సిగ్గుపడిపోయింది. పరదేశి కళ్ళు పెద్దవిచేసి తననే గమనించటం చూసింది.

దివాకు పరదేశి తను ఊహించుకున్నట్లు కనిపించలేదు. అతని వేషభాషలూ, మీసాలూ, నల్లని భారీ విగ్రహం చూసేప్పటికి దివాకు నవ్వువచ్చింది. అంతలోనే పరదేశీని గౌరవించాలి కాని నవ్వకూడదు అని జ్ఞాపకంవచ్చి గంభీరంగా మారిపోయింది.

దివా వదినలను పిలవటానికి లోపలకు వెళ్ళింది. దివా అన్నగారు పరదేశీని పని ప్రారంభించమని చెప్పి ఆఫీసుకు వెళ్ళిపోయాడు.

కొండయ్య మదన్‌లాల్ ఇల్లూ, ఆ ఇంటి ఐశ్వర్యం చూచి స్వర్గంలో ప్రవేశించినట్లు దిమ్మెరపోయాడు. దివాను చూసి అప్సరసలుకూడా ఉన్నారనుకున్నాడు.

మార్వాడీ స్త్రీల సౌందర్యాన్ని గురించి విన్నాడు కాని ఎన్నడూ చూడలేదు. విన్నదానికంటె, ఊహించుకున్న

దానికంటేకూడా సౌందర్యవతి అయిన దివానుచూసి చకితుడయ్యాడు. రాత్రంతా తడిసి సూర్యోదయపు నీరెండలో విచ్చటానికి సిద్ధంగాఉన్న ముద్ద మందార మొక్కలావుంది అనుకున్నాడు. నిజంగా రాజకుమారిలా ఉంది అనుకున్నాడు కొండయ్య మగ్గం దగ్గరకువెళ్ళి కూర్చుంటూ.

ఆమె మళ్ళీ కనుపిస్తే బాగుణ్ణు అనిపించింది కొండయ్యకు. ఇంతలో దివా చేత్తో ముదురునీలం పట్టుబట్ట పట్టుకొని రావడం కనిపించింది.

లత్తుకతో బంగారు సట్టే గొలుసులతో పచ్చగా, మృదువుగా, చిన్నవిగా, ముద్దుగావున్న పాదాలమీద కొండయ్య దృష్టిపడింది. ఆమె ఒక్కొక్క అడుక్కు తన గుండెలు లయతప్పుతున్నట్లనిపించింది. నడుంమీద ఎడం ప్రక్కగా బంగారుగొలుసు వేలాడుతోంది. బాబోయ్ అంత పెద్ద బంగారుగొలుసే అనుకున్నాడు. చేతులనిండుగా బంగారుగాజులూ, దండ కడియాలూ, పాపిటబొట్టు, చెవులకు రత్నాలు పొదిగి మెరుస్తున్న జుమికీలు కొండయ్య కళ్ళు ఆ దివ్యకాంతిని తట్టుకోలేక కిందకు వాలిపోయాయి. ఆమె శరీరచ్ఛాయముందు బంగారు ఛాయ వెలవెల బోతుంది అనుకున్నాడు.

ఆమె దగ్గరకువచ్చి నిల్చుంది. కొండయ్య మంత్రముగ్ధుడిలా ఆమె ముఖంలోకి చూస్తుండిపోయాడు.

దివాకు అతను అలాచూట్టం సిగ్గనిపించింది. పరదేశీ సినిమాలో హీరో ఆమెముఖంలో అచ్చం ఇలాగే చూశాడనుకుంది. అప్పుడే తనేం చెయ్యాలో తెలియలేదు.

ఇంతలో దివా వదినెలు కూడా చేతుల్లో ఏవేవో బట్టలు పట్టుకొని రావటం గమనించాడు కొండయ్య. అయితే వాళ్ళముఖాలు పూర్తిగా ముసుగులతో కప్పబడివున్నాయి. వివాహం కానివారు అలా ముసుగు వేసుకో నక్కరలేదు కాబోలు అనుకున్నాడు కొండయ్య.

కొండయ్య మదన్‌లాల్ ఇంట్లో పని చేయటం మొదలుపెట్టి పదిరోజులు దాటింది. దివా కనిపించట౦ కొంచెం ఆలస్యం అయితే అతనికళ్ళు ఆమెకోసం వెతికేవి ఆదుర్దాగా. తనలో వచ్చిన మార్పును తలచి కొండయ్యకు ఆశ్చర్యం అనిపించేది.

ఏమిటీ అనుభూతి! ఆ పిల్లంటే తనకెందుకీ అనురాగం! ఈ అనుబంధం ఈనాటిది కాదని ఎందుకనిపిస్తుంది తనకు? తనెక్కడా, ఆమెక్కడా? అయినా ఆమె తనకు కావాలి. ఆమెను చూసిన క్షణంలోనే ఆమె తనకు చాలా సన్నిహితురాలులా ఎందుకు కనిపించింది? తను ఎక్కడ పుట్టాడు? ఎక్కడ పెరిగాడు ? ఇంతదూరం రావటం, ఇంత గొప్ప ఇంటిబిడ్డను చూడటం, ఆమె అంటే తనకు అనురాగం ఏర్పడటం...ఏమిటిదంతా !

తను చందమామను అందుకోవటానికి కలలు కంటు న్నాడు. తను అలాంటి ఆలోచనలను మనస్సులోకి రానివ్వ కూడదు.

దీనికి భిన్నంగా ఉన్నాయి దివా ఆలోచనలు. దివా హృదయంలో పరదేశి క్రమంగా ప్రవేశించాడు. దానికి

కారణం కేవలం అతను పరదేశీకావటం, పరదేశీలను రాజకుమార్తెలూ ప్రేమిస్తారని తనుకథల్లో చదవటం, సినిమాల్లో చూడటం.

పరదేశీతో తను పారిపోతే పృథ్వీరాజుతో పారిపోయిన సంయుక్తలా తన కథనుకూడా అందరూ చెప్పుకుంటారేమో!

అంతలోనే దివాకు దిగులు అనిపించింది. పరదేశీ ఇంతవరకు ఒక్క మాట మాట్లాడలేదు. కనీసం తన చెయ్యి అయిన పట్టుకోలేదు. పరదేశీ తన ప్రేమను ప్రకటించక పోవటం దివాకు నిరాశా నిస్పృహా కలిగించింది.

వచ్చీరాని హిందీలో కొండయ్య మాట్లాడుతుంటే దివాకు హృదయంలో గిలిగింతలు పెట్టినట్లుండేది. క్రమంగా ఇద్దరిమధ్యా సన్నిహితత్వం పెరిగింది. ఆ ఇంట్లో ఈ విషయాన్ని ఎవరూ ఊహించను కూడాలేదు. పొంగటానికి సిద్ధంగాఉన్న పాలలాంటి ప్రాయంలో ఉన్న దివా, ఇంకా ఆ ఇంట్లో వారి దృష్టిలో బిడ్డే.

*　　　*　　　*

ఒక రోజు తెల్లవారుతూనే "కొండయ్య ఒక బంగారు పిచ్చుకను లేవతీసుకొని వచ్చాడు" అని ఊరంతా కోడిఅయి కూసింది.

ఆ ఊరు, ఆ ఇల్లూ, ఆ మనుషులూ, ఆ భాషాచూసిన దివాకు తనను ఎవరో బలవంతంగా ఎత్తైన కొండమీద నుంచి కిందకు తోసినట్లు తోచింది. ముఖ్యంగా కొండయ్యను

పెళ్ళి అయిందనీ, కొడుకుకూడా ఉన్నాడని తెలిసి బావురుమని ఏడ్చింది. ఆ రాత్రంతా ఆమెను కొండయ్య ఓదార్చుతూనే ఉన్నాడు. తను నిజంగా దివాకు అన్యాయం చేశానని కుంగి కుమిలిపోయాడు. తను చాలా పెద్ద తప్పుపని చేశాడు. తన మతికి మసిపూసినట్లు ప్రవర్తించాడు. కాని ఇప్పుడు చేసిన తప్పును దిద్దుకోలేని పరిస్థితి ఇది.

కొండయ్యభార్య చాలా రాద్ధాంతమే చేసింది. కాని కొండయ్య అత్తా మామా వంటినిండా బంగారంతో ఉన్న పిల్లనుచూసి తమ కష్టాలు ఇక గట్టెక్కా-యని సంతోషించారు. కూతురుకు తెలియజెప్పారు.

కాలచక్రంలో పది సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి. గులాబి పువ్వులా వచ్చిన దివా ప్లాస్టిక్ పువ్వులా మారిపోయింది. ఆమె వంటిమీది నగలు చాలావరకు హరించుకు పోయాయి. కొండయ్యకు తండ్రి వారసత్వంగా లభించిన పూరిల్లు డాబాగా మారింది. దివా ఆ డాబాలోనే ఉంటుంది. కొండయ్య కొడుకు హైస్కూలు చదువుకు వచ్చాడు. కొడుకంటే కొండయ్యకు ప్రాణం. వాడికోసం ఆస్తి పెంచాలనే తాపత్రయం పట్టుకుంది. వాడే తన వంశోద్ధారకుడు. దివాకు పుట్టిన బిడ్డలు ఎలాగూ తనకు స్వంతభార్య పిల్లలు కాలేరు. ఉంపుడుగత్తె బిడ్డలుగానే ఉండిపోతారు. అందువల్ల దివాకు పిల్లలు కలగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ తీసుకున్నాడు. దివానగలు అమ్మి డాబా కట్టించగా మిగిలిన డబ్బు మామచేతిలో పోశాడు. మామ ఆరేడు మగ్గాలు కొన్నాడు. ఈ పది సం

వత్సరాల్లో మామగారి వ్యాపారం బాగా పెరిగింది. కొండయ్య భార్యా కొడుకూ మామ ఇంట్లోనే ఉండి పోయారు.

దివా ఆ గ్రామస్థులదృష్టిలో లేచివచ్చిన మనిషిగానే మిగిలిపోయింది. గ్రామంలో అలాటివారికి లభించే మర్యాద గురించి వేరే చెప్పనక్కరలేదు.

దివాకు కొండయ్య ప్రేమ తప్పించి ప్రపంచం ఇంకేమీ అక్కరలేదు. క్రమంగా దక్షిణాది కట్టూ బొట్టూకు అలవాటుపడింది. తన మాతృభాషను దాదాపు మరచి పోయిందనే చెప్పాలి.

మరో పది సంవత్సరాలు దివా జీవితంనుంచి తప్పు కున్నాయి. కొండయ్యమామ చనిపోయాడు. మామ కొడుకులిద్దరూ వ్యాపారాన్ని చేజిక్కించుకున్నారు. కొండ య్యకు అందులోనుంచి చిల్లి కాని దొరకనివ్వటం లేదు.

కొండయ్య కొడుకు బి. ఏ. పాసయి విశాఖపట్నం ఉద్యోగానికి వెళ్ళిపోయాడు. కొండయ్య భార్యకూడా కొడుకు దగ్గరకు వెళ్ళిపోయింది. దివాను వదిలి వచ్చేలా వుంటే తండ్రిని తనతో తీసుకెళ్ళటానికి ఎలాంటి అభ్యంతరం లేదన్నాడు కొండయ్య కొడుకు.

కొండయ్య నిట్టూర్చాడు. అప్పటికి దివా వంటిమీద చిన్న మెత్తు బంగారం లేకుండా తినేశారు. రోజులు గడవటం ఎలాగా అని—ఒకరోజు కొండయ్య దిగాలుపడి కూర్చున్నాడు.

"ఎందుకలా ఉన్నావు?" అడిగింది దివా బియ్యం ఏరుతూ.

"నీకు చాలా అన్యాయం చేశాను. దివా నువ్వు నాకోసం చేసిన త్యాగానికి బదులుగా నేను నీకు ద్రోహం చేశాను. నాలో స్వార్థం ప్రవేశించింది. నా బిడ్డ, నా భార్య అనుకున్నాను. నిన్ను ఎప్పుడూ పరాయి దానిగానే చూశాను. నా వాళ్ళకోసం నీ ధనాన్ని ఖర్చుచేసిన నీచుణ్ణి. నీ భవిష్యత్తు ఏమవుతుందా అని ఏనాడూ ఆలోచించలేదు. ఒకవేళ నీ కంటేముందు నేను..."

మాట పూర్తికాకుండానే దివా లేచివచ్చి కొండయ్య నోరు మూసింది.

"అలాంటి మాటలు అనకండి. మీ చేతులమీదుగా నేను వెళ్ళిపోవాలి. నాలోమాత్రం స్వార్థంలేదూ? నేను మిమ్మల్ని ప్రేమించాను. మీరులేనిది నాకు సుఖంలేదు. కాబట్టి నా సుఖంకోసమే మీతో వచ్చాను. ఇందులో నాత్యాగం ఏమీలేదు."

కొండయ్య దివా ముఖంలోకి చూచాడు. మిసమిస లాడే ఆమె పచ్చని శరీరం గోధుమరంగుగా మారింది. ఒక ప్పటి రాజకుమారి ముతక నేతచీరలో, పోషణలేక ఎముకలు కనిపిస్తూ అతి సాధారణంగా కనిపించింది. దివాను రెండు చేతులతో లాక్కొని గుండెలకు గాఢంగా హత్తుకొని పసి పిల్లవానిలా బావురుమన్నాడు. దివాకుకూడా ఒక్కసారిగా దుఃఖం పొర్లుకొచ్చింది.

ఒకరోజు కొండయ్య కొడుకూ, తల్లీవచ్చి వాలారు. అకస్మాత్తుగా తాతగారి ఇంటిమీద తన అధికారాన్ని ప్రక టించి ఇంటిని అమ్మేశాడు.

కొండయ్యా దివా ఆ రాత్రి సత్రంలో తలదాచుకున్నారు.

రెండోరోజు ఏం చేయటానికి పాలుపోక దిగాలుపడి కూర్చున్న కొండయ్య దగ్గరకు దివా చిన్న ట్రంకుపెట్టె తెచ్చి ముందు పెట్టింది. కొండయ్య దివాకు కేవలం తనను ఓదార్చటానికే ఆ నవ్వును తెచ్చి పెట్టుకుందని తెలుసు.

దివా పెట్టె తెరిచింది. అందులో దివా కొండయ్యతో పారిపోయి వచ్చినరోజు ధరించిన దుస్తులులంగా, జాకెట్, జరీముద్దలు. ఓణీకి వెండిముత్యాలు కుట్టివున్నాయి జరీపని తెలిసిన కొండయ్యకు ఆ దుస్తుల విలువ తెలుసు. ఆమె అభిప్రాయం అర్థంచేసుకొన్న కొండయ్య కనుకొనల్లో నీరు నిలచింది. పాతిక సంవత్సరాల నాటి దివారూపం కొండయ్య కళ్ళముందుకు వచ్చి నిలచింది.

దివా పాదాలవైపు చూచాడు. మీగడ తరకల్లాంటి మెత్తని పాదాల స్థానంలో బూడిదరంగుగా సన్నగా నరాలు తేలి కనిపించాయి. పూర్వం లత్తుక ఉండేస్థానం పగిలి ఆ పగుళ్ళు మట్టితో నిండి కనిపించాయి. చటుక్కున దివా చెయ్యిపుచ్చుకున్నాడు. పువ్వంకంటే మృదువుగాఉండే ఆ చేతులు గరుగ్గా తగిలాయి. ముఖంలోకి చూశాడు. కలలతో నిండి కాంతులీనుతుండే ఆమె కళ్ళు కాంతిహీనంగా గాజు కళ్ళలా కనిపించాయి.

"భగవాన్" అంటూ రెండు చేతులతో ముఖం కప్పుకున్నాడు.

దివా తండ్రి దగ్గిరవుండి ఆమె వివాహంకోసం ప్రత్యేకంగా తయారు చేయించిన దుస్తులు అవి. అమ్మక తప్పలేదు.

...రెండువేల రూపాయలు వచ్చాయి. తాండవ నదికి పదిగజాల దూరంలో ఎవరికీ చెందని స్థలంలో ఒక గుడిసె వేసుకున్నాడు. కూర్చొనితింటే కొండలుకూడా కరిగిపోతాయి. డబ్బు అయిపోయింది. రోజు కూలీచేసి రోజులు దొర్లిస్తున్నాడు కొండయ్య.

ఆరు మాసాలకిందట ఒకరోజు ప్రొద్దుట యధాప్రకారం కొండయ్య నిద్ర లేవలేదు. దివా వైద్యుని దగ్గరకు పరుగెత్తింది. వైద్యుడువచ్చి చూసి పక్షవాతం అన్నాడు. నోరూ చేతులూ పడిపోయాయని చెప్పాడు.

అది విన్నప్పుడు దివా కాళ్ళకింద భూమి కంపించలేదు. కళ్ళముందు ప్రపంచం గిర్రున తిరగలేదు. ఆమెలోని సున్నితభావాలు ఏనాడో చచ్చిపోయాయి.

తాండవ నదివంతెనకు అటువైపుడున్న తు:లోని ఒక హోటలులో పప్పురుబ్బే పనికి కుదిరింది దివా. వాళ్ళే ఆమెకింత తిండి పెట్టేవారు. భర్తను పసిపిల్లవాణ్ణి తల్లి కాపాడినట్లు చూసుకొనేది.

* * *

తొలికోడి కూసింది. దివాకు అకస్మాత్తుగా మెలుకువ వచ్చింది. భర్త గుండెలమీద తను నిద్రపోయి ఆయనకు ఎంత బాధ కలిగించిందో అనుకుంటూ లేచింది. కొండయ్య ముఖంలోకి చూసింది. కళ్ళు తెరచుకొనే ఉన్నాయి. దివాకు

అంతా అర్థం అయింది. ఆమె ఏడవలేదు. గావుకేక పెట్ట లేదు. శిలా ప్రతిమలా ఆ మంచం పట్టెమీద అలాగే కూర్చుండిపోయింది.

కొండయ్య చావువార్త విని మామ కొడుకులు వచ్చారు. సాయంత్రానికి కొడుకూ భార్యా వచ్చారు.

దివాను పలకరించిన వాళ్ళులేరు. దూరంగా గుడిసె బయట కూర్చుంది ఆలోచిస్తూ. చనిపోయిన అతని శరీరం మీద తనకు ఎలాంటి అధికారమూ లేదు. అతని వాళ్ళంతా తమ అధికారాన్ని ప్రకటించుకుంటున్నారు.

కర్మ కాండంతా యథావిథి జరిగింది. దివా చివరకు ఒక వుంపుడుగత్తెలాగా మిగిలిపోయింది.

* * *

తాండవనది వంతెనమీదుగా లారీలూ, బళ్ళూ దుమ్ము రేపుకుంటూ పోతున్నాయి. వంతెనకు ప్రక్కగా రోడ్డుకు కుడివైపున ఓ స్త్రీ ఆకారం నిల్చొనివుంది క్రీనీడలో. జుట్టు సంస్కారం లేక జడలు కట్టివుంది. చీర చిరిగి మురిగ్గా ఆ శరీరాన్ని పూర్తిగా కప్పలేక పోతోంది.

రోడ్డున వెళుతూ ఓ వ్యక్తి కాల్చిన చుట్టపీకను పారేశాడు. ఆ స్త్రీ గబగబా ముందుకొచ్చి దాన్ని తీసుకొని గుప్పుగుప్పున పొగత్రాగటం మొదలుపెట్టింది. ఆమెను ఆ ఊళ్ళో అందరూ ఎరుగుదురు. కాని ఎవరూ పలకరించరు. రాత్రిపూట హోటల్లో పని చేసే కుర్రాళ్ళు పెట్టే ఎంగిలి మెతుకులు తింటూ, ఎంగిలిచుట్ట పీకలు తాగుతూ, వికృత

రూపంతో తిరుగుతూ ఉంటుంది. రాత్రంతా నిద్రలేకుండా ఊరంతా తిరుగుతూ వుంటుంది. ఆడవాళ్ళు పసిపిల్లలు నిద్రపోకుండా మారాం చేస్తే అదిగో దివా వస్తుంది అని భయపెడతారు.

దివా ఇలా కావటానికి బాధ్యులెవరు? ప్రేమ హృదయాలను అర్థం చేసుకోలేని సంఘమా లేక మానవుడు సృష్టించుకున్న కృత్రిమ మర్యాదలా? అందుబాటులో ఉన్న ఆడదాన్ని ఉపయోగించుకోవటానికి వెనకాడినివాడి స్వార్థపరత్వమా లేక ఆడదాన్ని సృష్టించి ఆమెకు ఓ మనస్సునిచ్చి ఆ మనస్సును మధువుతో నింపి, ఆ మధువును ఎవరి దోసిట్లో పోద్దామా అని మమతను కల్పించిన భగవంతుడా? ఎవరు బాధ్యులు!